క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.39 వేలు


కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలోని కుమారగిరిపై వెలసి ఉన్న శ్రీవల్లీ,దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.39.624 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం చైర్మన్ కె.కేశవరెడ్డి అన్నారు. మంగళవారం ఆలయ ఆవరణంలో ఏఎస్‌ఐ మునికృష్ణ సమక్షంలో 75 రోజుల హుండీ కానుకలను లెక్కించారు. మొత్తం రూ.39.624 ఆదాయం లభించింది. ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి వెచ్చిస్తామని కేశవరెడ్డి తెలిపారు. అంతకు ముందు స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. దేవదాయశాఖ ఈఓ కృష్ణనాయక్, ట్రస్టుబోర్డు సభ్యులు పయణిరెడ్డి, హరి, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఏపీఎం పరిదు మస్తాన్

పాలసముద్రం : వీఓలు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఐకేపీ ఏపీఎం పరిద్ మస్తాన్ తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఆర్‌పీ, సీసీఎఫ్, స్త్రీనిధి రికవరీ, ఆరోగ్య పోషణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్వాక్రా గ్రూపులకు, సిబ్బందికి రికార్డులు ఏవిధంగా రాయాలి, స్త్రీనిధి రికవరీ ఏవిధంగా చేయాలి, ఇంటి వద్ద పెరిటి కోళ్లు, పెరటి తోటలు ఏవిధంగా పెంచాలని అంశాలను వివరించారు. ఇప్పటి వరకు ఉన్నతి, స్త్రీనిధి తీసుకోని సభ్యులు పాడి పశువుల కొనుగోలు రుణాల కోసం సంఘమిత్రల వద్ద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు చిరంజీవి, లోకనాథం, సంఘమిత్రలు మురగయ్య, మంజుల, బాలయ్య, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహం


ప్యాడ్లు, పెన్నులు అందుకున్న విద్యార్థులతో పూర్వవిద్యార్థులు

నగరి : మున్సిపల్ పరిధిలోని పుదుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ప్రస్తుతం పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తమ ప్రోత్సాహాన్ని అందించారు. మంగళవారం పాఠశాలలో సమావేశమైన వారు 102 మంది పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, జామెంట్రీ బాక్సులు, పెన్నులు వితరణగా అందించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థి సంఘం అధ్యక్షుడు జాన్ మాట్లాడుతూ రానున్న పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్న ఉద్దేశంతో విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టీవీ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో మామూలు స్థితి


ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ అనుష

పాలసముద్రం : దివ్యాంగులతో తల్లిదండ్రులు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయిస్తే త్వరితగతిన మామూలు స్థితికి వస్తారని ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ తెలిపారు. పాలసముద్రం భవిత కేంద్రంలో మంగళవారం ఫిజియోథెరపిస్టు అనుష దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు అందించారు. తల్లిదండ్రులతో ఆమె మాట్లాడుతూ కుర్చునేందుకు, నిలబడేందుకు, నడిచేందుకు శారీరక ఇబ్బందులు పడుతున్న పిల్లలకు ప్రతి బుధవారం భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చేస్తున్నట్లు తెలిపారు. ఐఆర్‌టీ టీచర్ బాలాజీ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాల భర్తీకి దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీ శ తెలిపారు. వన్‌స్టాప్ సెంటర్ (సఖి) అత్యవసర సేవల ఉద్యోగాలకు (కాంట్రాక్టు) ప్రాతిపదికన ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్లు, వికలాంగులకు 10 ఏళ్ల వయసు స డలింపు ఉంటుందన్నారు. అత్యాచార బాధితులకు వన్ స్టాప్ సెంటర్ (సఖి)లో ఉద్యోగాలకు 50 శాతం రిజర్వేషన్ ఉందన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి, మహిళా సాధికారతాధికారి, రూ మ్ నం.506, బీ-బ్లాక్, 5వ అంతస్తు, తిరుపతి కలెక్టరేట్‌లో సమర్పించాలన్నారు. వివరాలకు తిరుపతి.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ పరిశీలించాలన్నారు.

ఆత్మ విశ్వాసమే మహిళకు ఆయుధం


హాజరైన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు


మాట్లాడుతున్న మంత్రి రోజా

- అంగన్‌వాడీలకు సీఎం జగనన్న ఇచ్చిన అన్నిహామీలు నెరవేరుస్తారు
- నాకు స్ఫూర్తి ప్రదాత దివంగత ముఖ్యమంత్రి జయలలిత
- ఘనంగా అంతర్జాతీయ మహిళా సాధికారత వారోత్సవాలు
- పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు: ఆత్మ విశ్వాసమే ఆయుధంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పర్యాటక, సాంస్కృతిక యువజన క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఏడీకే కల్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి రోజా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఇన్‌స్పైరింగ్ వ్యక్తి ఒకరు ఉంటారని, తనకు రాజకీయాల్లో తమిళనాడు దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత అని తెలిపారు. నేటి జగనన్న పరిపాలనలో మహిళలకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సముచిత స్థానం లభించిందని గర్వంగా చెబుతున్నానని చెప్పారు. వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకొస్తే, జగనన్న నాడు–నేడు కార్యక్రమం ద్వారా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. నేడు ఆడపిల్లలను ధైర్యంగా పాఠశాలలకు పంపే పరిస్థితి ఏర్పడిందన్నారు. నేటి సమాజంలో మగవారికి ధీటుగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ వర్కర్లను, ఆయాలను పిల్లలు అమ్మ అనే పిలుస్తున్నారని, అంత పవిత్రమైన ఉద్యోగాలు చేస్తున్నారని కొనియాడారు. అంగన్‌వాడీలకు సీఎం జగనన్న ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని స్పష్టం చేశారు. పరిస్థితులను అర్థం చేసుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అనేక సంక్షేమ పథకాలను మహిళల పేరిట సమర్థవంతంగా అమలు చేస్తూ జగనన్న మహిళా పక్షపాతిగా కీర్తి గడించిన విషయం మన అందరికీ తెలుసన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని అభ్యర్థించారు. అలాగే తనను మీ ఇంటి ఆడపడుచుగా భావించి నగరి నుంచి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి రోజాను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పుత్తూరు, నగరి సీడీపీఓలు పద్మజ, కృష్ణవేణి, మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, ఎంపీపీలు మునివేలు, భార్గవి, దీప, వైఎస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, అంగన్ వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

శాస్త్ర పరిరక్షణలో ఎన్‌ఎస్‌యూదే ప్రథమ స్థానం


భూమిపూజలో కంచి కామకోటి పీఠం అధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి

తిరుపతి సిటీ: శాస్త్ర పరిరక్షణలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం (ఎన్‌ఎస్‌యూ) ప్రథమ స్థానంలో ఉందని కంచి కామకోటి పీఠం అధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి కొనియాడారు. మంగళవారం వర్సిటీలో జరిగిన శంకరాచార్య భాష్య మండప భూమి పూజ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ సంస్కృత విద్యాలయంతో పాటు సంస్కృత భాష, శాస్త్రాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ వర్సిటీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి పాద స్పర్శతో పవిత్రమైందన్నారు. అకడమిక్ డీన్ టీవీ రాఘవాచార్యులు, కే.గణపతిభట్, రిజిస్ట్రార్ రమాశ్రీ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

- హాస్టళ్లను ఆకస్మిక తనిఖీ చేసిన జడ్జి కరుణకుమార్
- విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్

పుత్తూరు: మానవ అక్రమ రవాణా, కల్తీ ఆహారాన్ని నిరోధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి ఐ.కరుణకుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, ఎస్సీ బాలుర వసతి గృహం, ఎస్సీ బాలికల వసతి గృహాన్ని జడ్జి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఆహారం, హాస్టల్ పరిసరాలు శుభ్రంగా లేదని వార్డన్ ధనంజయులురెడ్డిని మందలించారు. అనంతరం స్థానిక మెయిన్ స్కూల్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ పిల్లలకు జంక్ ఫుడ్‌ను అలవాటు చేయరాదని తెలిపారు. పిల్లల పరిరక్షణ బాధ్యత తల్లిదండ్రులపై మరింతగా ఉందన్నారు. పిల్లలు ఎప్పుడూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పరిరక్షణలో ఉండాలని సూచించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలను ఒంటరిగా బయటకు పంపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో ఉన్నప్పుడు 100కు ఫోన్ చేయాలని లేకుంటే, దిశా యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులకు గురైతే, లైంగిక వేధింపుల నిరోధక కమిటీకి ఫిర్యాదు చేయాలన్నారు. ఇటీవల కాలంలో పిల్లల కిడ్నాప్‌లు పెరుగుతున్నాయని, వీటి నియంత్రణలో పోలీసులు తమ వంతు పాత్ర పోషించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలసుబ్రమణ్యం, పాఠశాల హెచ్‌ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం ఆచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

విపత్తులప్పుడు అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

- జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ

తిరుపతి అర్బన్: విపత్తుల సమయంలో నష్టాలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) శాఖలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అధునాతన సౌకర్యాలతో సిద్ధంగా ఉండాలని చెప్పారు. టెక్నాలజీని అవసరమైన మేరకు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక జిల్లా అధికారి రమణయ్య వివరిస్తూ విపత్తు స్పందనలో భాగంగా వరదలు, తుపాన్లు, అగ్ని ప్రమాదాలు చేటు చేసుకున్న సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మిచాంగ్ తుపాన్ సమయంలో 73 మందిని కాపాడామని వివరించారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజేంద్ర వివరిస్తూ సారా, గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఎప్పటికప్పుడు నియంత్రిస్తున్నామని తెలిపారు. చెన్నై, బెంగళూరు సరిహద్దు చెక్‌పోస్టుల్లో తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గంజాయి నియంత్రణలో 2023లో అత్యధికంగా 64 కేసులు నమోదయ్యాయని, మాదక ద్రవ్యాల నియంత్రణ, నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కళాశాలలు, ముఖ్యమైన కూడళ్లలో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన చర్యలపై హోర్డింగులు ప్రచార సామగ్రి వినియోగించి అవగాహన కల్పించాలని సూచించారు. వైజాగ్, బెంగళూరు, చెన్నై నుంచి రాకపోకలపై నిఘా ఏర్పాటు చేశామని, అలాగే రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తమిళనాడు, కర్ణాటక సరిహద్దులో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి

పాలసముద్రం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్‌సీ సూపర్‌వైజర్ రాధ తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు సమక్షంలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులకు, బాలింతలకు అందించారు. సర్పంచ్ గాలి మహేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెనూ ప్రకారం మంచి పౌష్టికాహారం, ప్రతి రోజు గుడ్డు అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు గుడ్లు, పండ్లు అందించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు స్పందన

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలం పులికల్లు సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు విచ్చేసి వైద్య పరీక్షలు చేసుకున్నారు. వైద్యాధికారులు సీతారామరాజు, హర్షవర్ధన్‌రెడ్డి, రాజశేఖర్, మీనాసయ్యద్, వెంకటేశ్వర్ నాయుడు పరీక్షలు చేసి మందులు అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ మమత మాట్లాడుతూ ప్రజల ఇంటి ముంగిటకే వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకే ఈ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది.

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

గంగాధరనెల్లూరు : ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందించి సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌ఓ) డాక్టర్ ప్రభావతి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్రకోన సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ హాజరై మాట్లాడారు. పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యం అందించడం కోసం అమలు చేస్తున్న ఈ పథకం పేదలకు వరంలా మారిందన్నారు. శిబిరంలో దాదాపు 220 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అర్హులైన 32 మందికి కంటి అద్దాలను అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రజిని, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పాలు, పిండి పంపిణీ చేస్తున్న సర్పంచ్ మహేష్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 70,570 మంది స్వామి వారిని దర్శించుకోగా 22,490 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.20 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

16న జాతీయ లోక్‌అదాలత్


మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్

పుత్తూరు: అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల భాగస్వామ్యంతో ఈనెల 16న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి ఐ.కరుణకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సబ్ కోర్టులో పోలీస్, రెవెన్యూ, ఎంపీడీఓ అధికారులతో సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ కోర్టు పరిధిలో పరిష్కారం అయ్యే రెవెన్యూ కేసుల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు కృషి చేయాలన్నారు. న్యాయవాదులు, పోలీసులు ప్రధానంగా ప్రామిసరీ నోటు, చెక్కు బౌన్స్ కేసులు రాజీ చేయాలని సూచించారు. పెండింగ్‌లోని సివిల్, రాజీకి లోబడిన క్రిమినల్ కేసులు, మనోవర్తి, ప్రీలిటిగేషన్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. నగదుతో పాటు విలువైన కాలన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీ మార్గమే సురక్షితమైనదని కక్షిదారులకు అవగాహన కల్పించాలని వివరించారు. లోక్‌అదాలత్ తీర్పు అంతిమ తీర్పని, దీనిపై అప్పీల్‌కు వెళ్లే అవకాశం లేదని స్పష్టం చేశారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సీ.రాఘవేంద్ర, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి సి.జానకి, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి వి.గోపాలకృష్ణ మాట్లాడారు. సమావేశంలో డీఎస్పీ వై.శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ పి.సింధుప్రియ, ఏజీపీ ఉదయ్‌కుమార్, తహసీల్దార్ హరికృష్ణ, డీటీ స్వరూపరాణి, ఎంపీడీఓలు మోహన్‌మురళి, శ్రీధర్‌నాయుడు, కృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దామోదర్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

దేశమ్మ అమ్మవారి కృపతోనే అభివృద్ధి

- ప్రస్తుత ప్రభుత్వంలో ఆలయాలకు మహర్దశ
- నేత్ర ప్రదాయణి క్షేత్రంలో పాదాల మండపం నిర్మాణానికి భూమిపూజ
- జగనన్న సమావేశ మందిరం, ఆర్వో ప్లాంటు ప్రారంభోత్సవం
- మంత్రి ఆర్‌కే రోజా


పాదాల మండపానికి భూమిపూజ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : అమ్మవారి కృపతోనే నేత్రప్రదాయణి క్షేత్రంలో అభివృద్ధి పనులు జరుగుతోందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, యువజన, సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మంగళవారం ఆలయంలో నిర్మించనున్న నూతన పాదాల మండపానికి ఆమె భూమిపూజ చేయడంతో పాటు రూ.41 లక్షల తుడా నిధులతో నిర్మించిన జగనన్న సమావేశ మందిరాన్ని, రూ.7.25 లక్షల నిధులతో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈఓ రామచంద్రయ్య పూర్ణకుంభ స్వాగతం పలికారు. దేశమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ అమ్మవారి కృపతోనే ఆలయంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతోందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆలయాలకు మహర్దశ వచ్చిందని జిల్లాలో వంద కోట్లకు పైగా నిధులతో ఆలయాల అభివృద్ధి జరుగుతోందన్నారు. ఆలయ నిర్మాణంలో దాతలు కూడా పాత్రధారులు అవుతున్నారని తెలిపారు. రూ.5 లక్షల నిధులతో ఆలయ పాదాల మండపం నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి శేఖర్, విమల, ఆర్‌వీ నరసింహులు నాయుడు, సుజాతమ్మ, శివగామి, జయలక్ష్మి నిర్మాణానికి దాతలుగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

వర్మీ కంపోస్ట్ తయారీపై శిక్షణ


శిక్షణకు హాజరైన మహిళలకు వర్మీ కంపోస్ట్‌ను అందజేస్తున్న డీన్ ప్రభాకర్‌రెడ్డి

తిరుపతి సిటీ : స్థానిక ఎస్వీ వ్యవసాయ కళాశాల కీటక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీపై మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఇంటిలోని వ్యర్థాలను పశువుల ఎరువులతో కలిపి ఇంటి వద్దనే వర్మీ కంపోస్ట్‌ను తయారు చేసుకోవచ్చన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాలలో పెంచుకునే పెరటితోటలకు విరివిగా కంపోస్ట్‌ను ఉపయోగించుకుంటే మంచి దిగుబడికి అవకాశం ఉంటుందన్నారు. రసాయన రహిత ఆకుకూరలు, కూరగాయలను గ్రామీణ మహిళలు పండించవచ్చని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఇటీవల కాలంలో ప్రాచుర్యం పొందుతున్న మిద్దెతోటలకు సైతం వర్మీకంపోస్ట్‌ను ఉపయోగిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం వర్మీ కంపోస్ట్ తయారు చేసే పద్ధతులను అధ్యాపకులు మహిళలకు వివరించారు. తయారు చేసిన వర్మీకంపోస్ట్‌ను హాజరైన మహిళలకు ఆయన అందజేశారు. శిక్షణలో ప్రొఫెసర్ రాజశ్రీ, డాక్టర్ ఎంఎస్‌వీ చలం, తిరుపతి గ్రామీణ ప్రాంత మహిళలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.